RNI REG.NO. TELTEL/2021/83468

R. REPUBLIC HINDUSTAN

# రిపబ్లిక్ హిందుస్థాన్


తెలుగు దినపత్రిక



COMBO OFFER
Two Websites at Just ₹9900/-
• Responsive website
• CMS E-PAPER + MAIN WEBSITE
• AI AUTOMATIC CONTENT WRITER (NEWS • OTHERS CONTENT)
• EARN MONEY WITH GOOGLE ADSENSE
at Just ₹9900/-
8985614333
Powered by: WEB39.IN



సంపుటి : 1 సంచిక:237 | Simultaneously published from Adilabad , Asifabad & Hyderabad. | శుక్రు వారం 04-04- 2025 | పేజీలు: 4 | వెల: రూ.3.00

## ట్రంప్ టారిఫ్ ప్రకంపనలు

**- ప్రతీకారం తీర్చుకుంటాం : ట్రంప్**
**- వాణిజ్య యుద్ధం భయంలో ప్రపంచం**

న్యూయార్క్: మిత్రదేశాలను, ప్రత్యర్థులను ఒకే విధంగా సవాలు చేస్తూ ప్రతీకారం తీర్చుకుంటామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. వైట్ హౌస్‌లోని రోజ్ గార్డెన్‌లో నిర్వహించిన "మేక్ అమెరికా ఎగైన్ వెల్త్" కార్యక్రమంలో పాల్గొన్న ట్రంప్ అమెరికా "లిబరేషన్ డే"గా సుంకాల జాబితాను ప్రకటించారు.



## థాయ్‌లాండ్, శ్రీలంకలో పర్యటన

న్యూఢిల్లీ, : ప్రధాని మోడీ బ్యాంకాక్ చేరుకున్నారు. అక్కడ ఘనస్వాగతం లభించింది. రెండు దేశాల పర్యటన కోసం గురువారం బయల్దేరి వెళ్లారు. గురువారం నుంచి థాయ్‌లాండ్, శ్రీలంకలో పర్యటించనున్నారు. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ ఎయిర్‌పోర్టులో దిగగానే మోడీకి ఘనస్వాగతం లభించింది. థాయ్‌లాండ్ అధికారులతో పాటు భారతీయులు భారీ స్వాగతం పలికారు. తొలుత రెండు రోజుల పాటు థాయ్‌లాండ్‌లో మోడీ పర్యటించనున్నారు. థాయ్‌లాండ్‌లో 6వ బిమ్‌స్టెక్ శిఖరాగ్ర సమావేశంలో మోడీ పాల్గొనన్నారు. పర్యటనలో భాగంగా థాయ్‌లాండ్ ప్రధాని పేటోంగ్‌టార్న్ షినవత్రాతో కూడా భేటీ అయి ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించనున్నారు. ఇక సాయంత్రం బిమ్‌స్టెక్ సదస్సులో మోడీ పాల్గొంటారు. ఈ సదస్సులో భారత్‌తో పాటు- థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్, మయన్మార్, భూటాన్ దేశాల అధినేతలు పాల్గొననున్నారు. ఇక ఈ సదస్సులో సాంకేతిక, ఆర్థిక సహకారంపై చర్చించనున్నారు.



## తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీం

న్యూఢిల్లీ, : తెలంగాణలో పార్టీ మారిన పదిమంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేల వ్యవహారంపై విచారణ పూర్తయ్యిం ది. సుప్రీం తీర్పును రిజర్వ్ చేసింది. ఎమ్మెల్యేలు పార్టీ మారిన వ్యవహారంపై గురువారం ఉదయం సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. ఇదే అంశంపై బుధవారం కూడా సుదీర్ఘవిచారణ జరిగింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. స్పీకర్ తరఫున సీనియర్ కౌన్సిల్ ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. గురువారం స్పీకర్ కార్యదర్శి తరఫున సింఘ్వి వాదనలు వినిపించారు. స్పీకర్ కార్యదర్శి తరఫున అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపిం చారు. స్పీకర్ నిర్ణయానికి కాలపరిమితి విధించే విష యంలో ఇప్పటి వరకు ఎలాంటి తీర్పులు లేవని సింఘ్వి తెలిపారు. మణిపూర్ వ్యవహారం పూర్తిగా భిన్నమైనదని, ఆ ఒక్క విషయాన్ని ప్రత్యేకంగా పరిగణించారని అన్నారు. అలాగే రాణా కేసు పూర్తిగా ప్రత్యేకమైనదని, ప్రస్తుత ఆ అంశానికి సరిపోదని సింఘ్వి కోర్టుకు తెలిపారు. దీంతో రాణా కేసులో కోర్టు జోక్యం చేసుకుని అనర్హత విధించిందని జస్టిస్ గవాయ్ తెలిపారు. మీ దృష్టిలో రీజనబుల్ టైమ్ అంటే ఏంటి అని సింఘ్విని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు.



## రాజ్యసభకు చేరిన వక్ఫ్ సవరణ బిల్లు


## సభలో ప్రవేశపెట్టిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు

న్యూఢిల్లీ, : సుదీర్ఘ చర్చ తర్వాత లోక్‌సభలో ఆమోదం పొందిన వక్ఫ్ సవరణ బిల్లును కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు గురువారం ఎగువసభలో ప్రవేశపెట్టారు. అనంతరం దీనిపై చర్చ ప్రారంభించారు. ఈ బిల్లుపై బుధవారం లోక్‌సభలో 14 గంటలకు పైగా చర్చ జరిగింది. విపక్షాల ఆరోపణలు, అధికారపక్షం కౌంటర్లతో సభ వాడీవేడిగా సాగింది. అనంతరం ఓటింగ్ పక్రియ నిర్వహించగా. బిల్లుకు అనుకూలంగా 288 మంది, వ్యతిరేకంగా 232 మంది సభ్యులు ఓటు వేశారు. 56 ఓట్ల తేడాతో ప్రతిపక్షాల అభ్యంతరాలు వీగిపోయాయి. రాజ్యసభలోనూ దీనిపై చర్చ కోసం 8 గంటలు కేటాయించారు. అవసరమైతే సమయాన్ని పెంచనున్నారు. అనంతరం ఓటింగ్ చేపడతారు. ఎగువ సభలోనూ అధికార ఎన్డీయేకు స్వల్ప ఆధిక్యం ఉండటంతో బిల్లు గట్టెక్కడం లాంఛనమే అనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఉభయ సభల్లో ఆమోదం పొందిన అనంతరం రాష్ట్రపతి సంతకం తో ఇది చట్టంగా మారనుంది. లోక్‌సభలో వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం పొందడంపై కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ తీవ్రంగా స్పందించారు. రాజ్యాంగంపై నిస్సిగ్గుగా దాడి జరిగిందని అభిప్రాయపడ్డారు.

2వ పేజీలో...

## తెలంగాణలో వానలు

## పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్



2వ పేజీలో...

**హైదరాబాద్,:** తెలంగాణలోని పలు జిల్లాలో వాతావరణశాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఆయా జిల్లాల్లో వడగండ్ల వర్షం కురిసే అవకాశముందని తెలిపింది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలం కూడన్‌పల్లి సమీపంలో పిడుగుపాటుకు ఇద్దరు మహిళలు మృతి చెందారు. మరికొందరికి గాయాలయ్యాయి. వ్యవసాయ పనులు చేస్తుండగా పిడుగుపడటంతో ఇద్దరు మహిళలు చనిపోయారు. నేటి నుంచి వచ్చే నాలుగు రోజుల వరకు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఒడిశా నుంచి కోమోరిన్ ప్రాంతం వరకూ ఉన్న ద్రోణి, చత్తీస్‌గఢ్‌లో ఏర్పడిన ఉన్నత వాయు చక్రవాత తుపాను ప్రభావంతో వాతావరణ మార్పులు చోటు

## పవన్ కళ్యాణ్‌తో నాగబాబు భేటీ



అమరావతి, : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను గురువారం జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలో వీరిద్దరూ ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. అయితే, ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత నాగబాబుకు డిప్యూటీ సీఎం పవన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కాగా, ఇటీవల ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా ఎన్నికైన కొణిదెల నాగబాబు.. ఏప్రిల్ 2వ తేదీ నాడు ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం నాడు మధ్యాహ్నం ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన నాగబాబుకు మెగాస్టార్ చిరంజీవి శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ విధాన పరిషత్ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసిన తమ్ముడు నాగబాబుకి అన్నయ్య, వదిన ఆత్మీయ అభినందనలు, ఆశీస్సులు తెలియజేస్తున్నామని ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు.



## సన్నబియ్యం పంపిణీ చారిత్రాత్మక నిర్ణయం..

### మంత్రి దామోదర్ రాజనర్సింహా

మెదక్ : ప్రజా పంపిణీ వ్యవస్థలో సన్న బియ్యం పంపిణీ చారిత్రాత్మక నిర్ణ యమని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఆహార భద్రత పథకంలో భాగంగా ఆందోల్ - జోగిపేట కేంద్రంలోని మార్కెట్ గంజ్ లో ఏర్పాటు చేసిన సన్న బియ్యం పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్ర మంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్ధిదారులకు సన్న బియ్యంను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి రేషన్ కార్డులను, ఇందిరమ్మ ఇండ్లను, ఇండ్ల స్థలాలను అందజేస్తామన్నారు.

2వ పేజీలో...

## అమెరికా టారిఫ్‌లపై మీ వైఖరేంటి : రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ విదేశాం గ విధానంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. అమెరికా సుంకాల పెంపుపై మోడీ ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలని అన్నారు. గురువారం లోక్‌సభలో జీరో అవర్‌లో రాహుల్‌గాంధీ మాట్లాడారు. అమెరికా విధించిన సుంకాలు భారత ఆర్థిక వ్యవస్థను ముఖ్యంగా ఆటో పరిశ్రమ, ఔషధా లు మరియు వ్యవసాయ రంగాలను పూర్తిగా నాశనం చేయనున్నాయని అన్నారు. ఎవరో ఒకసారి ఇందిరా గాంధీని అడిగారు. విదేశాంగ విధానంలో మీరు ఏవైపు మొగ్గుచూపుతారు. కుడి వైపుకా, ఎడమవైపుకా అని ప్రశ్నించారు. తాను భారతీయురాలినని, ఏవైపు మొగ్గు చూపనని, నేరుగా నిలబ డతానని ఇందిరాగాంధీ సమాధాన మిచ్చారని అన్నారు.
కానీ బిజెపి, ఆర్ఎస్ఎస్‌లకు భిన్నమైన మనస్తత్వ మని, వారు కుడి, లేదా ఎడమ ఏ వైపుకి మొగ్గుచూ పుతారని అడిగినప్పు డు .. తాము ప్రతి విదేశీయుడి ముందు తలవం చుతామని చెబుతారని అన్నారు. ఇది వారి సంస్కృతిలో, చరిత్రలో ఉన్న విషయమని, అందరికీ తెలుసునని అన్నారు. చైనా భారత్ భూభాగంలో 4,000 చ.కిమీ ఆక్రమించుకుందని ఆరోపించారు.

# పదోన్నతిపై బదిలీ అవుతున్న ఓసీ1 అధికారులకు ఆత్మీయ వీడ్కోలు సన్మానం



**నా జీవితకాలం మర్చిపోలేని గని -ఉదయ్ హరిజన్**
**క్రమశిక్షణ గల గని నుండి ఎంతో నేర్చుకున్నాను -పేరాల శ్రీనివాసరావు**
**నాకు కూడా సహకరించండి -మేనేజర్ దురిశెట్టి రమేష్**
**ఎస్ఓపిలకు అనుగుణంగా పనిచేయండి -పిఓ రాజశేఖర్**

కమాన్ పూర్ఏప్రిల్,: ఆర్జీ3 ఓసి1 గనిలో పనిచేస్తు పదోన్నతిపై బదిలీ అవుతున్న అధికారులను ఘనంగా సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికిన గని ఉద్యోగులు. ఓసీ1 సైట్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సింగరేణి సంస్థ ఇటీవల జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారంగా ఆర్జి2 ఓసిపి3 ప్రాజెక్ట్ అధికారిగా ఓసీ1 మేనేజర్ ఉదయ్ హరిజన్ మరియు ఎల్లందు ఏరియా కోయగూడెం ఓసి2 మేనేజరుగా గని రక్షణాధికారి పేరాల శ్రీనివాసరావు పదోన్నతిపై బదిలీ అవుతున్న సందర్భంగా గని ఉద్యోగులు ఆత్మీయ సన్మానం చేసి ఘనంగా వీడ్కోలు పలికారు. అలాగే గని మేనేజరుగా ఆర్జీ1 జీడీకే1 ఇంక్లైన్ బావి నుండి బదిలీపై వచ్చిన దురిశెట్టి రమేష్ గారిని పూల బొకేతో స్వాగతిస్తూ ముగ్గురు అధికారులను ఒకే వేదికలో శాలువాలు, కండువాలు, టవల్లతో పలు సెక్షనుల ఉద్యోగులతోపాటు, అధికారుల సంఘం, ప్రాతినిధ్య, గుర్తింపు యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించి మాట్లాడారు. ప్రాజెక్టు అధికారిగా వెళుతున్న ఉదయ్ హరిజన్ మాట్లాడుతూ సుదీర్ఘకాలం ఏడు సంవత్సరాలు మేనేజరుగా పని చేసే అవకాశం ఇచ్చిన గని ఉద్యోగులు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి సంవత్సరం వార్షిక లక్ష్యం చేధించి, ఆన్యువల్ సేఫ్టీ కాంపిటీషన్లో ఉత్తమ గనిగా ఎంపిక అయ్యేటట్లు, కేంద్ర ప్రభుత్వంచే ఫైవ్ స్టార్ రేటింగ్ గనిగా ఎంపిక అవ్వడానికి పనిచేసి పేరు తెచ్చి నా జీవిత కాలం మర్చిపోలేని తృప్తినిచ్చిన ఉద్యోగులందరికీ రుణపడి ఉంటానని, ఓసీ1 గనిఉద్యోగులతో నాకు సొంత ఇంటిఫీలింగ్ ఉందని సంతోషకరమైన మాటలను వ్యక్తం చేశారు. రక్షణ అధికారిగా పనిచేసిన పేరాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏడు మాసాల పాటు పనిచేసి ఓసి1 గని నుండి ఎంతో నేర్చుకోవడం జరిగిందని సింగరేణిలో ఓసి1 క్రమశిక్షణ గని అన్నారు. నూతన మేనేజరుగా బాధ్యతలు చేపట్టిన దురిశెట్టి రమేష్ గారు మాట్లాడుతూ గత అధికారులకు సహకరించి పేరు తెచ్చి వార్షిక లక్ష్యాన్ని రక్షణతో సాధించుటకు అందరూ సహకరించాలని కోరారు. గని ప్రాజెక్ట్ అధికారి రాజశేఖర్ గారు మాట్లాడుతూ ఉద్యోగులందరూ రక్షతో పనిచేస్తూ ఎస్ఓపిల ప్రకారంగా నడుచుకుంటూ ఎప్పటిలాగానే నూతన మేనేజర్ సహకరించి ఉత్పత్తికి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో అధికారుల సంఘం ప్రతినిధి ఎల్ వినాయక్, ఐఎన్టియూసి కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్, గని ఐఎన్టియుసి పిట్ కార్యదర్శి వెంకట్ స్వామి గౌడ్, ఎఐటియూసి పిట్ కార్యదర్శి దుగ్యాల తిరుపతిరావు, సంక్షేమ అధికారి సాయికృష్ణ గని ఉద్యోగులు పాల్గొన్నారు.

# ట్రంప్ టారిఫ్ ప్రకంపనలు

మొదటిపేజీ తరువాయి...



దీంతో ప్రపంచంలో వాణిజ్య యుద్ధం జరుగుతుందనే భయాలను పెంచారు. ట్రంప్ భారతదేశంపై 'డిస్కౌంట్'తో 26 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. బ్రిటిష్ ఉత్పత్తులపై 10 శాతం, ఈయు ఉత్పత్తులపై 20 శాతం సుంకాలు విధిస్తున్నట్లు తెలిపారు. చైనాపై 34 శాతం, జపాన్ పై 24 శాతం విధిస్తున్నట్లు ప్రకటించారు. విదేశీ తయారీ వాహనాలపై 25 శాతం సుంకం అర్ధరాత్రి నుండి అమల్లోకి వచ్చింది. అమెరికా అధ్యక్షుడు కీలక వాణిజ్య భాగస్వాములైన కెనడా, మెక్సికోలను విమర్శించారు. వారి వాణిజ్య పద్ధతులు న్యాయంగా లేవని, ఎదురుదెబ్బ తగలాల్సి ఉంటుందని ఆయన అన్నారు. అమెరికా "స్వర్ణయుగం"లోకి ప్రవేశిస్తోందని ట్రంప్ పేర్కొన్నారు. పరస్పర సుంకాలు విధించడం వల్ల ఇతర దేశాల "అన్యాయమైన" వాణిజ్యాన్ని అరికట్టడానికి సహాయపడుతుందని ట్రంప్ పేర్కొన్నారు. కానీ ఆర్థికవేత్తలు ఈ చర్య ప్రపంచ ద్రవ్యోల్బణాన్ని తీవ్రతరం చేసి వాణిజ్య యుద్ధానికి దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు. ట్రంప్ ప్రతిపాదించిన సుంకాల జాబితా గురించి ప్రపంచ దేశాలు ఆందోళన చెందుతున్నాయి. పరస్పర సుంకాల యొక్క 'ప్రతీకార చర్య' గణనీయమైన వాణిజ్య లోటు ఉన్న 10-15 దేశాలకే పరిమితం కాదన్నారు. అన్ని దేశాలపై సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లు కుదేలు అయ్యాయి. చివరి నిమిషం వరకు ఎటువంటి సమాచారాన్ని వెల్లడించకుండా వైట్ హౌస్ జాగ్రత్తగా ఉంది. ఎటువంటి ఆధారాలు అందుబాటులో లేకపోవడంతో, ఊహాగానాలు చెలరేగాయి. స్టాక్ మార్కెట్లలో అనిశ్చితి ప్రతిబింబించింది. అమెరికా మిత్రదేశాలు సుంకాల ప్రకటనతో చాలా ఆగ్రహంగా ఉన్నాయి. బలమైన ఎదురుదెబ్బ తగలబోతుందని యూరోపియన్ యూనియన్ దేశాలు హెచ్చరించాయి.

# రాజ్యసభకు చేరిన వక్ఫ్ సవరణ బిల్లు

మొదటిపేజీ తరువాయి...


గురువారం రాజ్యసభలోకి వెళ్లే ముందు సోనియాగాంధీ మీడియాతో మాట్లాడారు. సమాజంలో శాశ్వత విభజనను తీసుకొచ్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని.. అందులో భాగంగానే వక్ఫ్ బిల్లును ఆమోదించిన ట్లు-గా వ్యాఖ్యానించారు. దిగువ సభలో బిల్లును బుల్డోజర్ చేశారని చెప్పారు. అలాగే వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లును కూడా రాజ్యాంగాన్ని అపహాస్యం చేసేందుకే సభలోకి తీసుకొస్తున్నారని సోనియాగాంధీ ధ్వజమెత్తారు. మోడీ నిర్ణయాలు కారణంగా దేశం అగాధంలోకి నెట్టబడుతోందని.. ఈ నిర్ణయాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాజ్యాంగం కాగితంపైనే ఉంటుంది.. అందుకే దాన్ని బుల్డోజర్ చేయడమే బీజేపీ లక్ష్యమని పేర్కొన్నారు. న్యాయం కోసం ఎంపీలంతా కలిసి పోరాడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇక పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశమే ఇవ్వడం లేదని.. తరచుగా గందరగోళం సృష్టిస్తున్నారని ఆరోపించా రు. వక్ఫ్ సవరణ బిల్లుకు లోక్‌సభలో ఆమోదం లభించింది. బుధ వారం బిల్లుపై పార్లమెంట్‌లో వాడీవేడీగా చర్చ జరిగింది. దాదాపు 12 గంటల పాటు- అధికార-ప్రతిపక్ష సభ్యులు ప్రసంగించారు. అర్ధరాత్రి దాటిన తర్వాత బిల్లు ఆమోదం కోసం లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ఓటింగ్ నిర్వహించారు. బిల్లుకు అనుకూలంగా ఓటింగ్ పడడంతో ఆమోదం పొందింది. బిల్లుకు అనుకూలంగా 282 మంది ఓటు- వేయగా.. 232 మంది సభ్యులు బిల్లును వ్యతిరేకించారు. ఇక గురువారం ఈ బిల్లు రాజ్యసభకు రానుంది. ఇక్కడ కూడా దాదాపు 8 గంటల పాటు-చర్చ జరగనుంది. వక్ఫ్ పాలకవర్గాల్లో మరింత పారదర్శకత, జవాబుదారీతనం పెంచుతూ పాలనలో మహిళల భాగస్వామ్యం తప్పనిసరి చేసేలా ఈ కొత్త బిల్లును కేంద్రం తీసుకొచ్చింది. ఈమేరకు 1995 నాటి వక్ఫ్ చట్టంలో దాదాపు 40 సవరణలు చోటుచేసుకోనున్నాయి. ముస్లిం సమాజం నుంచి వస్తున్న డిమాండ్ల మేరకే ఈ మార్పులు చేస్తున్నట్లుప్రభుత్వ వర్గాలు చెప్పాయి. ఈ బిల్లును గతేడాది ఆగస్టులోనే కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. అప్పుడు దీనిపై విపక్షాల నుంచి పెద్దఎత్తున వ్యతిరేకత రావడంతో దీనిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ- (జేపీసీ) పరిశీలనకు పంపింది. ఈ కమిటీ పలు ప్రతిపాదనలతో బిల్లుకు ఆమోదం తెలిపింది.


# పార్టీ మారిన ఎమ్మెల్యేల కేసు

మొదటిపేజీ తరువాయి...

న్యాయవాదులు ఇలాంటి కేసుల విషయంలో వ్యవహరించే విధానం చాలా ఇబ్బందికరంగా ఉందన్నారు. సుప్రీంకోర్టుకు వచ్చిన తర్వాత న్యాయవాదుల తీరు పూర్తిగా మారిపోతోందని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. ఇటీవల సీఎం అసెంబ్లీలో మాట్లాడిన మాటలను కౌశిక్ రెడ్డి తరపు న్యాయవాది మరోసారి ప్రస్తావించారు. తెలంగాణలో ఉప ఎన్నికలు రావని, స్పీకర్ తరపున కూడా చెపుతున్నా అంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను న్యాయవాది ప్రస్తావించారు. అసెంబ్లీలో మాట్లాడితే ఏ కోర్టు నుంచి అయినా రక్షణ ఉంటుందని వ్యాఖ్యానించారని న్యాయవాది అన్నారు. దీంతో ముఖ్యమంత్రి కనీసం స్వీయ నియంత్రణ పాటించలేరా అని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. గతంలో కూడా ఇలాంటి ఘటనే జరిగిందని, ఆ తర్వాత కూడా ఇలాగే వ్యవహరిస్తే ఎలా అని జస్టిస్ గవాయ్ అన్నారు. దీంతో అభిషేక్ మను సింఘ్వి మాట్లాడుతూ ప్రతిపక్షం నుంచి అంతకు మించిన రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. ఇప్పుడు అవన్నీ అప్రస్తుతం అని ధర్మాసనం పక్కన పెట్టింది. సీఎం మాటలు కోర్టు దిక్కారం కింద తీసుకోవాల్సి వస్తుందని జస్టిస్ గవాయ్ అన్నారు. మేము సంయమనం పాటిస్తున్నామని, మిగతా రెండు వ్యవస్థలు అదే గౌరవంతో ఉండాలని జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు. స్పీకర్‌కు పిర్యాదు చేసిన తర్వాత కోర్టులో కేసులతో తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకురావాలని చూసారని సింఘ్వి అన్నారు. సింగిల్ జడ్జి ఇచ్చిన సూచనలను సానుకూలంగా తీసుకుని ఉంటే కేసు ఇక్కడివరకు వచ్చేది కాదని జస్టిస్ గవాయ్ అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసి విచారణకు వచ్చిన తర్వాతే నోటీసులు ఇచ్చారని గవాయ్ అన్నారు. ఈ క్రమంలో మణిపూర్ వ్యవహారం, రాణా కేసుతో పాటు మరికొన్ని అంశాలను అభిషేక్ సింఘ్వి కోర్టుకు వివరిస్తూ వాదనలు ముగించారు. అభిషేక్ మను సింఘ్వి వాదనలు ముగియడంతో.. పిటీషనర్ల తరపున కౌశిక్ రెడ్డి తరపు న్యాయవాది ఆర్యామ సుందరం మరోసారి చివరి వాదనలు వినిపించారు. మహారాష్ట్ర వ్యవహారం సుభాష్ దేశాయ్ కేసులో స్పీకర్ నిర్ణయంపై సుప్రీంకోర్టు స్పష్టంగా ఆదేశాలు ఇచ్చిందన్నారు. స్పీకర్‌కు తగిన ఆదేశాలు ఇవ్వడానికి సుప్రీంకోర్టుకు అన్ని అధికారాలు ఉన్నాయన్నారు. సుభాష్ దేశాయ్ కేసులో స్పీకర్ తప్పక తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని రాజ్యాంగ ధర్మాసనం తీర్పులో పేర్కొందని న్యాయవాది ఆర్యామ సుందరం అన్నారు. జనవరిలో సుప్రీంకోర్టు విచారణ ప్రారంభించాక స్పీకర్ నోటీసులు ఇచ్చారని, మూడు వారాలు సమయం ఇచ్చారని, ఆ మూడు వారాల సమయం కూడా పూర్తి అయిందని న్యాయవాది ఆర్యామ సుందరం అన్నారు. నోటీసులు పంపిన సమాచారం కూడా ప్రతిపక్ష నేతకు ఇవ్వలేదని న్యాయవాది పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు మరోసారి ప్రస్తావించారు. దీనిపై న్యాయవాది ముకుల్ రోహత్గీ అభ్యంతరం చెప్పారు. ధర్మాసనం కూడా తాము ఆ విషయంలోకి వెళ్లడం లేదని స్పష్టం చేసింది. దీంతో బీఆర్ఎస్ పిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై విచారణ సుప్రీంకోర్టులో ముగిసింది. ఇరువైపు వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వు చేసింది. అయితే 8 వారాల్లోగా తీర్పు ఇవ్వాలని సుప్రీం కోర్టును న్యాయవాది ఆర్యమ సుందరం కోరారు.

# గాజాపై ఇజ్రాయిల్ దళాలు దాడి : 80 మంది మృతి





గాజా : బుధవారం రాత్రి గాజాలోని ఖాన్ యూనస్ నగరంలోని నివాస భవనాలపై ఇజ్రాయిల్ సైన్యం వైమానిక దాడికి పాల్పడింది. ఇజ్రాయిల్ సైన్యం గాజా అంతటా జరిపిన బాంబు దాడుల్లో 80 మంది పాలస్తీనియన్లు మృతి చెందారు. ఈ దాడి తర్వాత శిథిలాల కింద చిక్కుకున్న పాలస్తీనియన్ల కోసం గాజా పౌర రక్షణ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. మరోవైపు జబాలియా శరణార్థి శిబిరంలోని ఐక్యరాజ్యసమితి వైద్య సౌకర్యాల స్థావరంపైనా ఇజ్రాయిల్ దాడి చేసిందని, ఈ దాడిలో మహిళలు, చిన్నారులతో సహా 22 మంది మృతి చెందారని ఆరోపణలను ఇజ్రాయిల్ ఖండించింది. సిరియా, డమాస్కస్, హమాస్ గవర్నరేట్‌లపై ఇజ్రాయిల్ సైన్యం దాడి చేసినట్లు ఇజ్రాయిల్ సైన్యం ధృవీకరించింది. కాగా, మరోవైపు సిరియాపై ఇజ్రాయిల్ సైన్యం దాడి చేసింది. ఇజ్రాయిల్ సైన్యం చేసిన తాజా దాడిలో 9 మంది పౌరులు మృతి చెందారని, పలువురు గాయపడ్డారని దక్షిణా సిరియాలోని డెరా గవర్నరేట్‌లోని ప్రావిన్షియల్ ప్రభుత్వం తెలిపింది. సిరియా రాజధాని డమాస్కస్, మధ్య ప్రావిన్స్ హమాపై ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు బాంబు దాడికి పాల్పడ్డాయి. యెమెన్‌లోని హౌతి నియంత్రణలో ఉన్న ప్రాంతాలపై అమెరికా సైన్యం రాత్రిపూట దాడులు జరుపుతోంది. బుధవారం రాత్రి పౌరుల వాహనాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా దాడులకు పాల్పడుతోందని హౌతి మీడియా నివేదించింది.

# హెచ్‌సీయూలో సంబురాలు..

## సుప్రీంకోర్టు తీర్పుపై విద్యార్థుల హర్షం..



హైదరాబాద్ : కంచ గచ్చిబౌలి భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ చర్యలు అన్నీ నిలిపివేయాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలపై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హెచ్‌సీయూలో విద్యార్థులు సంబురాలు నిర్వహించారు. సుప్రీంకోర్టు తీర్పుతోనైనా రేవంత్ రెడ్డి దుందుడుకు చర్యలు విరమించుకోవాలని విద్యార్థులు సూచించారు. జీవ వైవిధ్యాన్ని కాపాడుకునేందుకు పోరాటం కొనసాగిస్తామని తేల్చిచెప్పారు. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. భూముల్లో ప్రభుత్వ చర్యలన్నీ తక్షణం ఆపేయాలని ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు రిజిస్ట్రార్ పంపిన మధ్యంతర నివేదికను సుప్రీంకోర్టు పరిశీలించింది. వార్తా కథనాలను జస్టిస్ గవాయ్ ముందు అమికస్ క్యూరీ మెన్షన్ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ప్రతివాదిగా చేర్చింది కోర్టు. హైకోర్టు రిజిస్ట్రార్ నివేదిక ఫొటోలు చూస్తే పరిస్థితి అర్థమవుతుందన్నారు. వందల యంత్రాలు మోహరించాల్సిన అవసరమేంటని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. అత్యవసరంగా కార్యకలాపాలు చేపట్టాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. ఇది చాలా తీవ్రమైన అంశం అని కోర్టు పేర్కొంది. 3 రోజుల్లో 100 ఎకరాల్లో చెట్లు కొట్టివేత చిన్న విషయం కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. చెట్ల కొట్టివేతకు అనుమతి తీసుకున్నారా..? అని కోర్టు ప్రశ్నించింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఒక్క చెట్టు కూడా నరికివేయొద్దని కోర్టు ఆదేశించింది. అఫిడవిట్ దాఖలు చేయాలని సీఎస్‌ను కోర్టు ఆదేశించింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఎలాంటి చర్యలు చేపట్టొద్దని కోర్టు ఆదేశించింది. ప్రభుత్వం మార్చి 15న వేసిన కమిటీ అధికారులూ జవాబు ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. ఉల్లంఘనలు జరిగితే సీఎస్ వ్యక్తిగత బాధ్యత వహించాలని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

# సన్నబియ్యం పంపిణీ చారిత్రాత్మక నిర్ణయం..

మొదటిపేజీ తరువాయి...

రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల 85 లక్షల మంది లబ్ధిదారులకు ఒక కోటి 81లక్షల 696 మెట్రిక్ టన్నుల సన్నబియాన్ని ప్రతి కుటుంబంలోని సభ్యులకి 6 కిలోల చొప్పున సన్న బియ్యంను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. సంగారెడ్డి జిల్లాలోని 846 చౌక ధరల దుకాణాల ద్వారా 3లక్షల 78, 728 తెల్ల రేషన్ కార్డులు, అందులో 26, వేల 115 అంత్యోదయ కార్డులు, 100 అన్నపూర్ణ కార్డుల ద్వారా 12 లక్షల 32,274 మంది సభ్యులకు సన్నబియ్యం పంపిణీ ద్వారా లబ్ధి చేకూరుతుందని మంత్రి వెల్లడించారు.ఆహార భద్రత కార్డులోని ప్రతి ఒక్క కుటుంబ సభ్యులకు ఆరుకిలోల చొప్పున, అంత్యోదయ కార్డు ఒక్కంటికి 35కిలోల చొప్పున, అన్నపూర్ణ కార్డు ఒక్కంటికి 10 లోల చొప్పున ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ పథకం ద్వారా లబ్ధిదారులందరికి నాణ్యమైన బియ్యాన్ని అందజేస్తున్నామన్నారు మంత్రి దామోదర్ రాజనర్సింహ. సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, జిల్లా అదనపు రెవెన్యూ కలెక్టర్ మాధురి, ఆర్డీఓ పాండు, మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్ మోహన్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు శ్రీనివాస్ రెడ్డి, అంబదాసు, నియోజకవర్గ నాయకులు సురేందర్ గౌడ్, స్థానిక ప్రజా ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# తెలంగాణలో వానలు

మొదటిపేజీ తరువాయి...



చేసుకుంటాయని.. రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయన్నారు. ఇవాళ మధ్యాహ్నం 3 వరకు ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో పాటుగా దట్టమైన మేఘాలు కమ్ముకుంటాయని చెప్పారు. ఇప్పటికే కొన్ని జిల్లాలకు ఐఎండీ అధికారులు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. నిజామాబాద్, కామారెడ్డి, హైదరాబాద్, ఆదిలాబాద్ పరిసరాల్లో గంటకు 30-50 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీస్తాయని అధికారులు తెలిపారు. నేడు, రేపు ఆదిలాబాద్, వికారాబాద్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో పిడుగులు పడతాయని హెచ్చరించారు. ప్రజలు బయట తిరగడం తగ్గించి, ఆశ్రయం కోసం సురక్షిత ప్రదేశాలను ఎంచుకోవాలని సూచించారు.

# భూమి, భుక్తి, విముక్తి కోసం దొడ్డి కొమురయ్య చూపిన చొరవ ఎనలేనిది : ఎమ్మెల్యే కృష్ణారావు





బాలానగర్, ఏప్రిల్ 3 : తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య పాత్ర చిరస్మరణీయమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఇవాళ ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్ పేట అంజయ్య నగర్‌లో నిర్వహించిన దొడ్డి కొమురయ్య జయంతి కార్యక్రమానికి కృష్ణారావుతోపాటు ఎమ్మెల్సీ నవీన్ కుమార్, ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. భూమి, భుక్తి, విముక్తి ఉద్యమంగా మారడానికి దొడ్డి కొమురయ్య చూపిన చొరవ ఎనలేనిది అన్నారు. ప్రజల దుర్భరమైన పరిస్థితులను నివారించేందుకు ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేందర్ గౌడ్, కర్రే జంగయ్య, ఇర్ఫాన్, మేకల హరినాథ్, మక్కల నర్సింగరావు, రాజయ్య, లింగం, సంపత్, హైలెష్, తిరుపతి, పోచయ్య, మక్కాల సత్యనారాయణ, బాలరాజ్ నగేష్, పిట్ల రాజు ముదిరాజ్, అశోక్, ఉమా, బురి యాదగిరి, మోహన్ ముదిరాజ్, రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీ సంక్షేమంలో పురోగతి సాధించిన కరీంనగర్ జిల్లా



**కరీంనగర్,** సమీక్ష సమావేశంలో అధికారులు సమర్పించిన నివేదికలు పరిశీలించానని, ఎస్సీ ఎస్టీలకు అందాల్సిన సంక్షేమంలో కరీంనగర్ జిల్లా పురోగతి సాధించిందని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. కలెక్టరేట్లో అధికారులతో సమీక్ష సమావేశం అనంతరం స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ సమస్యలపై అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఉద్యోగాల భర్తీలో, ఉద్యోగుల పదోన్నతుల్లో రోస్టర్ రిజర్వేషన్ పాటించాలని అన్నారు. అధికారులు ప్రజలతో సత్సంబంధాలు నెలకొల్పాలని సూచించారు. ప్రతి గ్రామంలో, ప్రతినెలా సివిల్ రైట్స్ డే నిర్వహించాలని అన్నారు. ఎస్సీ ఎస్టీ భూముల సమస్యలు భూమాత పోర్టల్ ద్వారా పరిష్కారం అవుతాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఎస్సీ ఎస్టీలు ప్రభుత్వ భూముల్లో కట్టుకున్న ఇండ్లను రెగ్యులరైజ్ చేసే అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.



# నీటి కొరత షూరూ...



హైదరాబాద్, ఏప్రిల్ 3,: హైదరాబాద్ నగరంలో భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయి. నగర అభివృద్ధి వేగంగా జరుగుతున్నప్పటికీ.. దీని ప్రభావం భూగర్భ జలాలపై తీవ్రంగా పడింది. ఇటీవల జలమండలి జరిపిన ఒక సర్వేలో హైదరాబాద్ పరిధిలోని చాలా ప్రాంతాల్లో భూగర్భ జలాలు తీవ్రమైన స్థాయిలో పడిపోవడం గుర్తించబడింది. ఔటర్ రింగ్ రోడ్డు వరకూ 948 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో నిర్వహించిన సర్వేలో.. కేవలం 27 చదరపు కిలోమీటర్లలోనే జలమండలి సూచించిన స్థాయిలో జలాలు ఉన్నాయని.. మిగతా 921 చదరపు కిలోమీటర్లలో ఈ జలాలు ప్రమాదకర స్థాయికి చేరుకున్నట్లు నిర్ధారించారుపరిణామం.. నగరంలోని అత్యంత అభివృద్ధి చెందిన ప్రాంతాలైన హైటెక్ సిటీ, మాదాపూర్, శేరిలింగంపల్లి, కూకట్పల్లి తదితర ప్రాంతాల్లో కూడా తీవ్ర ప్రభావాన్ని చూపింది. జలమండలి చేసిన సర్వేలు ఈ ప్రాంతాల్లో భూగర్భ జలాలు దాదాపు లేనట్టుగా సూచిస్తున్నాయి. ప్రత్యేకంగా.. ఎఐఇం చుట్టూ దాదాపు 5 కిలోమీటర్ల పరిధిలోని ప్రాంతాలలో వర్షపు నీరు ఎక్కడా భూమిలోకి రాకుండా సిమెంట్ పల్లాలు, ఇతర నిర్మాణాలు అడ్డుకుపోతున్నాయని గుర్తించారు. గత ఏడాది కంటే వర్షపాతం ఎక్కువ అయినప్పటికీ.. అందులోని నీరు ఎక్కువగా గ్రౌండ్వాటర్కు చేరకుండానే.. మూసీ నదిలోకి లేదా డ్రైనేజీ ద్వారా వెళ్లిపోతున్నట్లు కనిపిస్తోంది. ఈ పరిస్థితుల వల్ల.. నగరంలోని ప్రజలు 11,000 ట్యాంకర్లను ప్రతిరోజూ తమ అవసరాల కొరకు బుక్ చేస్తున్నారు. 2024లో.. నగరంలో 586 వాటర్ ట్యాంకర్లు మాత్రమే అందుబాటు లో ఉన్నాయి. కానీ ఇప్పుడు 678 వాటర్ ట్యాంకర్లు వినియోగంలో ఉన్నాయి. ఈ పరిస్థితికి పరిష్కారం చూపడానికి జలమండలి 81 వాటర్ ఫిల్లింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసింది. కానీ ఈ డిమాండ్ పెరిగిపోవడంతో.. జలమండలి మరో 17 కొత్త స్టేషన్లను ప్రారంభించడానికి సిద్ధమైంది. హైదరాబాద్లోని అగ్రనగరాలు.. హైటెక్ సిటీ, శేరిలింగంపల్లి, కూకట్పల్లి, నిజాంపేట్, మాదాపూర్, ప్రగతి నగర్, మణికొండ, ఎస్సార్ నగర్ ప్రాంతాలు ఇప్పటికే అత్యధిక కంగావాటర్ ట్యాంకర్ల డిమాండ్నుఎదుర్కొంటున్నాయి. పలు అపార్ట్మెంట్లలో బోర్లు పని చేయక.. వాటర్ ట్యాంకర్లపై ఆధారపడే పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితి.. పర్యావరణ రక్షణకు సంబంధించిన ప్రాముఖ్యతను మరింత పెంచుతుంది. జల వనరులను సురక్షితంగా కాపాడు కోవడం.. వాటి వినియోగాన్ని సక్రమంగా నిర్వహించడం.. తద్వారా భవిష్యత్తులో నీటి సమస్యలను నివారించడానికి ప్రజలు , అధికారులు కలిసి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# కేంద్ర మంత్రివర్గం నుండి అమిత్ షా ను బర్తరఫ్ చేయాలి

**పెగడపల్లి మండలంలో జై బాపు-జై భీమ్-జై సంవిధాన్ పాదయాత్రలో పాల్గొన్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్**

పెగడపల్లి (ధర్మపురి) :ఏప్రిల్ 03 : కేంద్ర మంత్రివర్గం నుండి అమిత్ షా ను బర్తరఫ్ చేయాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. జై బాపు–జై భీమ్ –జై సంవిధాన్ పాదయాత్రలో భాగంగా గురువారం జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని నంచర్ల గ్రామం నుండి దేవికొండ గ్రామం మీదుగా ల్యాగలమర్రి గ్రామం వరకు నిర్వహించిన పాదయాత్రలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి గా ఉన్న అమిత్ షా గత కొన్ని రోజుల క్రితం పార్లమెంటులో వ్యవహరించిన తీరు పట్ల ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగ నిర్మాత డా. బిఆర్ అంబేద్కర్ పైన అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే మంత్రివర్గం నుండి అమిత్ షా ను బర్తరఫ్ చేయాలని, ఒక బాధ్యత గల మంత్రి పదవిలో ఉంటూ ఈ విధంగా అంబేద్కర్ పైన అనుచిత వ్యాఖ్యలను చేయడాన్ని ఖండిస్తూ, ప్రతి గ్రామ గ్రామాన తెలిపే విధంగా జై బాపు,జై భీం,జై సంవిధాన్ అనే నినాదంతో పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందని, దీన్ని బట్టి బీజేపీ పార్టీ అణచివేత ధోరణి, కుటిల బుద్ధి బయటపడిందని, అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం వల్లనే ఈ రోజు మోడీ ప్రధానమంత్రి హోదాలో, అమిత్ షా హోం శాఖ మంత్రి హోదాలో కూర్చున్నారన్న విషయం మర్చిపోవద్దని అన్నారు. నేను ఒక ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్ గా హోదాలో కొనసాగుతున్నానంటే దానికి కారణం అంబేద్కర్ పెట్టిన భిక్ష అని, అమిత్ షా పైన చర్యలు తీసుకొని మంత్రి పదవి నుండి



బర్తరఫ్ చేసేంత వరకు పాదయాత్ర, మా పోరాటం కాంగ్రెస్ పార్టీ పక్షాన కొనసాగుతుందని ప్రభుత్వ విప్ లక్షణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర రాములు గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు ఒరుగల శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రటరి తాటిపర్తి శోభారాణి, మాజీ జెడ్పిటిసి కాసుగంటి రాజేందర్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తాటిపర్తి ప్రభాకర్ రెడ్డి, పూసాల తిరుపతి, కడారి తిరుపతి, సంధి మల్లారెడ్డి, అమిరిశెట్టి మల్లారెడ్డి, చెట్ల కిషన్, చాట్ల విజయభాస్కర్, పురుషోత్తం అనిల్ గౌడ్, ఆకుల విష్ణు, కొండం మధుసూదన్ రెడ్డి, ముదుగంటి పవన్ రెడ్డి, తడగొండ రాజు, కొత్తూరు విష్ణు, ఎడ్ల శ్యాంసుందర్ రెడ్డి, సురకంటి సత్తిరెడ్డి, బైరి రాజు, లైశెట్టి శంకరయ్య, తడగొండ లక్ష్మణ్, మందపల్లి అంజయ్య, మారం కొమురయ్య, కర్ణకంటి మల్లారెడ్డి, కల్లేపల్లి రాజు, తడగొండ తిరుపతి, అంజి నాయక్, ఇస్లావత్ రవి నాయక్, పటేల్ సత్యనారాయణ రెడ్డి, కట్ల సత్తయ్య, పుల్కం జలపతి, నీరటి రాజేందర్, బుర్ర రమేష్ గౌడ్, అశోక్ గౌడ్, అనిల్ గౌడ్, మేక రాయమల్లు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెనెక్ట్

**4వ ఫేడరేషన్ కప్- ఆల్ ఇండియా నేషనల్ సాఫ్ట్ బేస్ బాల్**



కరీంనగర్ ఏప్రిల్ 03 అల్ఫోర్స్ జెన్ నెక్స్ట్ వావిలాలపల్లి కరీంనగర్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి ఎస్ సాత్విక్ మహారాష్ట్ర లోని పర్భన్ జిల్లాలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న 4వ ఫేడరేషన్ కప్–ఆల్ ఇండియా నేషనల్ సాఫ్ట్ బేస్ బాల్ పోటీలలో ఎంపిక కావడంతో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఉన్నత చదువులతో పాటు విద్యార్థులు క్రీడారంగం లో కూడా రాణించడం హర్షణీయమైన కొనియాడారు చదువులతో పాటు ఆటలను ప్రోత్సహించడంలో అల్ఫోర్స్ ఎప్పుడు ముందుటుంది అని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత తెలిపారు. ప్రతిష్టాత్మకమైన ఆటలతో విద్యార్థిని విద్యార్థులు విద్యతో పాటు క్రీడారంగంలో తమ నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని విద్యార్థులకు సూచించారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులకు అవకాశం కలిపిస్తాం

**పెద్దపల్లి జిల్లా ఇన్చార్జి లు మేకల సాయి కిరణ్ రెడ్డి**



పెద్దపల్లి ప్రతినిధి: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యువజన కాంగ్రెస్ జిల్లా స్థాయి ఎక్జిక్యూటివ్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జిలు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు అవకాశం కలిపిస్థామని అలాగే యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ సమీక్ష సమావేశంలోని చర్చల ప్రకారం జిల్లా యూత్ కాంగ్రెస్ ఇంచార్జ్లు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు శ్రీ సాయికిరణ్, వినూత్న జిల్లాలోని ఇంతకుముందు అసెంబ్లీ, మండల స్థాయి కమిటీలను రద్దు చేయాలని ఆదేశించారు. అంతేకాకుండా, జిల్లా అధ్యక్షుడు, అసెంబ్లీ అధ్యక్షుడిని తక్షణమే కొత్త కమిటీలను ఏర్పాటు చేయాలని, తదుపరి సమీక్ష సమావేశానికి ముందు వాటిని నివేదించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బొంకూరి అవినాష్,అసెంబ్లీ అధ్యక్షులు ముత్యాల నరేష్ ముదిరాజ్, రామగుండం అసెంబ్లీ ప్రెసిడెంట్ నాజిమ్, జిల్లా ఉపాధ్యక్షులు ఇరికి మహేష్, జిల్లా జనరల్ సెక్రటరీ లు గుమ్మడి ప్రసాద్, పిరంగి రాజు, మనోజ్ క్రాంతివిర్, గోపాగోని శ్రీకాంత్, రమేష్, మండలాల అధ్యక్షులు జడల రాజు, శివ రామకృష్ణ, గాగిరెడ్డి దేవేందర్ రెడ్డి, రాహుల్ గౌడ్, మండల ఉపాధ్యక్షులు అరగొండ రాజ్ కుమార్, శ్యామ్ సుందర్, ముక్కెర ప్రవీణ్ కుమార్, ఎండీ అయూబ్, మారం రాకేష్, కవుటం సతీష్, ఊరగొండ వినయ్, కొలిపాక్ శ్రవణ్ కుమార్ లు పాల్గొన్నారు.

# పెండింగ్ అట్రాసిటీ కేసులను పరిష్కరించాలి

**పోస్టుల భర్తీలో రిజర్వేషన్ తప్పనిసరి**
**సివిల్ రైట్స్ డే ద్వారా అవగాహన కల్పించాలి**
**సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టిస్తే చర్యలు**
**తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**

**కరీంనగర్,:** వివిధ దశల్లో పెండింగ్లో ఉన్న ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను ఈ నెల 30 లోగా పరిష్కరించాలని, ఉద్యోగ నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ తప్పనిసరిగా పాటించాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, జిల్లా అధికారులతో ల్యాండ్, ప్రభుత్వ సేవలు, అట్రాసిటీ తదితర అంశాలపై కమిషన్ చైర్మన్, సభ్యులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ వివిధ దశల్లో పెండింగ్లో ఉన్న ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను ఈ నెల 30 లోగా పరిష్కరించాలని అన్నారు. అట్రాసిటీ కేసులు కోర్టులో నిలబడే విధంగా బలమైన సాక్ష్యాలను పోలీసులు సమర్పించి నిందితులకు శిక్షపడేలా చూడాలని కోరారు. కోర్టు స్థాయిలో పెండింగ్లో ఉన్న కేసులపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమీక్షించి త్వరితగతిన పరిష్కారం అయ్యే విధంగా చూడాలని అన్నారు. అట్రాసిటీ కేసుల్లో వైద్య ఆరోగ్య శాఖ నుండి పెండింగ్ లో ఉన్న అవసరమైన వైద్య నివేదికలు వెంటనే పంపాలని ఆదేశించారు. కులం సర్టిఫికెట్ సమర్పించని కారణంగా పెండింగ్లో ఉన్న కేసులకు సంబంధించి వెంటనే సంబంధిత సర్టిఫికెట్ జారీ చేయాలని తహసిల్దార్లకు సూచించారు. రెవెన్యూ శాఖ పరిధిలో



పెండింగ్లో ఉన్న భూమి సంబంధిత కేసులను ఈ నెల 30లోగా పరిష్కరించాలని ఆర్డీవోలను ఆదేశించారు. అంబేద్కర్ విద్యా నిధి పథకం కోసం ఎక్కువ మంది దరఖాస్తు చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో కులాంతర వివాహ ప్రోత్సాహకాలకు కావలసిన బడ్జెట్ వివరాలు సమర్పిస్తే ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఔట్సోర్సింగ్ ఏజెన్సీ లోను ఎస్సీ ఎస్టీలకు రిజర్వేషన్ కల్పించాలని అన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టించినా, ఇతర కార్యక్రమాలకు మళ్లించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఉద్యోగాల భర్తీలో, ప్రమోషన్లలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ తప్పనిసరిగా పాటించాలని, రిజర్వేషన్ రిజిస్టర్ ను తనిఖీ చేస్తామని తెలిపారు. ప్రతి నెలా గ్రామంలో సివిల్ రైట్స్ డే నిర్వహించి గ్రామస్తులందరిని చైతన్య పరచాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లాస్థాయి ఎస్సీ ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలని, ఈ సమావేశానికి జిల్లాస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, ఎజెండా తమకు పంపించాలని అధికారులను ఆదేశించారు. సాంఘిక సంక్షేమ పాఠశాలలో ఏవైనా వసతులు, సౌకర్యాలు అవసరమైతే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం అవలంబించాలని, ఎస్సీ ఎస్టీలకు న్యాయం చేయాలని పోలీసు శాఖకు సూచించారు. కరీంనగర్ బాలసదనంలో పెరిగిన అనాథ ఎస్సీ యువతికి వివాహం జరిపించిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని, జిల్లా సంక్షేమ అధికారి సబితను ప్రత్యేకంగా అభినందించారు. వివిధ శాఖల వారీగా ఎస్సీ, ఎస్టీ నిధుల కేటాయింపు, ఉద్యోగాల భర్తీ తదితర అంశాలను సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీ కిరణ్, ప్రఫుల్ దేశాయ్ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణిగుంట్ల ప్రవీణ్, రాంబాబు నాయక్, ఆర్డీవోలు జిల్లా స్థాయి అధికారులు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ధరఖాస్తుదారుల కొరకే రాజీవ్ యువ వికాసం సహాయ కేంద్రం ఏర్పాటు

**పెగడపల్లి ఎంపిడిఓ శ్రీనివాస్ రెడ్డి**

పెగడపల్లి (ధర్మపురి): ఏప్రిల్ 03 : జగిత్యాల జిల్లాలోని పెగడపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్వీకరణ సహాయ కేంద్రం ( Help desk ) ను గురువారం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ధరఖాస్తుదారుల నుండి దరఖాస్తులను ఎంపిడిఓ ఎ. శ్రీనివాస్ రెడ్డి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి మహేందర్, పిఆర్ ఏఈ షంషీర్ అలీ, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రిని ఆకస్మికంగా తనఖీ చేసిన కలెక్టర్



జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధిఏప్రిల్ 3: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. ఆసుపత్రి లోని టీ హబ్, సెంట్రల్ డ్రగ్స్ స్టోర్, ఎన్.సి.డి సెంటర్, డైస్ బిల్డింగ్ ను పరిశీలించి తదుపరి వైద్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేయబోయే స్కాన్ మిషన్ కోసం ఆసుపత్రి సూపరింటెండెంట్ తో కలిసి పరిశీలించి టీ హబ్ లో ఒక గదిని ఎన్.సి.డి సెంటర్ ఏర్పాటు చేసిన గదులను గుర్తించారు. టీ హబ్ లో రోగుల పట్టికను పరిశీలించి టీ హబ్ లో జరుగుతున్న పరీక్షల గురించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సెంట్ర ల్ డ్రగ్స్ స్టోర్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డ్రగ్ స్టోర్ లో నిల్వ ఉన్న మందుల గురించి వివరాలు అడిగి రిజిస్టర్ ను పరిశీలించారు. జిల్లాలో ఆసుపత్రులకు వైద్య సేవలకు వచ్చే ప్రజలకు అనుగుణంగా సీజనల్ వ్యాధుల మందులు, యాంటీ బయోటిక్స్ ఇతర అత్యవసర వ్యాక్సిన్లను, మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మందుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని సూచించారు. పక్కనే ఉన్న డైస్ బిల్డింగ్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు అనువుగా ఉంటుందో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వైద్యులతో సమీక్షా సమావేశం నిర్వహించి ఆసుపత్రిలో జరుగుతున్న సేవలు, సౌకర్యాలు, సిబ్బంది తదితర అంశాలపై చర్చించారు. ఆసూపత్రిలో కావలసిన అవసరాలపై నివేదికలు అందించాలని ఆసుపత్రి పర్యవేక్షకుడిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆసుపత్రి సూపరిన్ టెండెంట్ డాక్టర్ నవీన్ కుమార్, వైద్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

